క్లుప్తంగా

ఉచితంగా ప్యూరిఫైడ్ వాటర్ పంపిణీ

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా ప్యూరిఫైడ్ వాటర్ పంపిణీని ప్రారంభించారు. గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు గోనె కర్ణాకర్ తన సొంత ఖర్చుతో నిర్మించుకున్న చందు వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంటు ద్వారా గ్రామంలో మంచినీటి పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కర్ణాకర్ మాట్లాడుతూ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి, సబ్ స్టేషన్, సెంట్రల్ బ్యాంకుకు ప్రతిరోజు, చర్చికి ప్రతి ఆదివారం, ఆలయాలకు సోమవారం, మసీదుకు శుక్రవారం ఉచితంగా నీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పేర్ల సామ్సన్, గోనె అన్నమ్మ, గోనె శ్యాంసుదర్, గోనె చెన్నయ్య, జానకమ్మ, మానస, లింగమ్మ, శ్రావణి, స్వరూప, చందన పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికురాలు మృతి

చిట్యాల : మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న మోత్కురి శివమ్మ(48) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఆదివారం మున్సిపల్ చైర్మన్ కోమటి రెడ్డి చినవెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో కూర్చున్న గ్రామస్తులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 38వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షలో ఆ గ్రామానికి చెందిన వృద్ధులు కూర్చున్నారు. ఫార్మా కంపెనీ నిర్మాణం నిలిపివేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని పలువురు వృద్ధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాజుల పెద్ద యాదయ్య, పెద్ద వెంకటయ్య, మునుకుంట్ల అంజయ్య, తలారి రాములు, సురిగి రాములు, జాజుల వెంకటయ్య, నందిపాటి వెంకన్న, మహంకాళి నర్సింహ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



బెల్టుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎస్ఐ

నకిరేకల్ : ఆత్మరక్షణకు, ఆరోగ్యానికి కరాటే దోహదపడుతుందని నకిరేకల్ ఎస్ఐ శంకర్ అన్నారు. నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామ్ పోటీల్లో విజేతలకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు ఆయన అందజేసి మాట్లాడారు. విద్యార్థులు, బాలికలు కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. ఈ పోటీల్లో నకిరేకల్, నల్లగొండ, కట్టంగూర్, శాలిగౌరారం, కేతేపల్లి మండలాల నుంచి 53 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్, టీఎస్ చీఫ్ ఎగ్జామినర్ రాష్ట్ర కమిటీ సభ్యులు విశ్వనాథ్, నాగార్జున, శ్రీనివాసచారి, విజయ్‌కుమార్, మధు, సాయికిరణ్, శివ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



వినతిపత్రం అందిస్తున్న ఉద్యమకారులు

మునుగోడు : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమకారులకు ఏదైనా సంక్షేమ పథకాలు అందించేవిధంగా సీఎం కేసీఆర్‌కు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ ఆదివారం మునుగోడులోని అంబేడ్కర్ విగ్రహానికి ఉద్యమకారులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు తోట నర్సింహాచారి, కూరెళ్ల వెంకట ఉదయకృష్ణ, పాలకూరి నర్సింహగౌడ్, మాదగోని నరేందర్ గౌడ్, జడిగం సతీష్‌కుమార్, నర్సింహ, సతీష్, రాంమూర్తి, గంగరాజు, పోలె వెంకన్న తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రానికి చెందిన ఎల్.నర్సింహ ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆదివారం ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పంపిన రూ.10వేలు, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుత్త ప్రేంచందర్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయాన్ని స్థానిక నాయకులు అందజేశారు.

హైవేపై యథేచ్ఛగా పశువులు



హైవేపై వాహనాలకు అడ్డంగా తిరుగుతున్న పశువులు



హైవే మధ్యన ఉన్న డివైడర్‌పై మేస్తున్న గేదెలు

- కేతేపల్లి మండల పరిధిలో తరచూ ప్రమాదాలు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు, జీవాలు
- పట్టించుకోని జీఎమ్మార్ సిబ్బంది

కేతేపల్లి : హైదరాబాద్–విజయవాడ 65 నంబరు జాతీయ రహదారిపై కేతేపల్లి మండల పరిధిలో పశువుల సంచారంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మీదకు అకస్మాత్తుగా పశువులు అడ్డుగా వస్తుండడంతో వాహదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ప్రయాణికులతోపాటు పశువులు మృత్యువాత పడుతున్నాయి. వాహనాలు దెబ్బతిని పలువురు గాయాలపాలవుతున్నారు.

విచ్చలవిడిగా హైవేపై సంచారం

హైదరాబాద్–విజయవాడ 65 నంబరు జాతీయ రహదారి వెంట కేతేపల్లి మండలంలో ఇనుపాముల, కొర్లపహాడ్, కేతేపల్లి, చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాలున్నాయి. హైవే విస్తరణ అనంతరం వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. వాహనాలు అధిక వేగంతో దూసుకెళ్తున్నాయి. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో రైతులు తమ పశువులను విచ్చలవిడిగా రోడ్డు మీదకు వదులుతున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై పెరుగుతున్న పూల మొక్కల నడుమ ఉన్న పచ్చటి గడ్డిని మేస్తూ గేదెలు ఒకేసారి రోడ్డుపైకి వస్తుండడంతో అనుకోని దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల రైతులు దగ్గరుండి పశువులను డివైడర్ మధ్యలో మేపుతున్నా జీఎమ్మార్ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా రాత్రి సమయాల్లో వాహనదారులకు గేదెలు కనిపించ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్డుపై మృతి చెందిన పశువుల కళేబరాలను సంబంధిత రైతులు తీసుకెళ్లడం లేదు. కళేబరాలను కుక్కలు పీక్కుని తింటున్నాయి. దీంతో ముక్కులు పగిలేలా వచ్చే దుర్వాసనతో ఆదారి గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపైకి పశువులను వదలకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

కంచె ఏర్పాటు చేయాలి



రోడ్డుకు ఇరువైపులా ఇనుప రోప్ లేకపోవడంతో పశువులు నేరుగా రోడ్డు మీదకు వస్తున్నాయి. దీంతో ప్రమాదాలు విపరీతంగా జరుగుతున్నాయి. హైవే వెంట ఉన్న గ్రామాల్లో సర్వీసు రోడ్లు, కంచె నిర్మించాలి. రహదారిపైకి పశువులు రాకుండా చూసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలి.

–కోట లింగయ్య, చీకటిగూడెం

అధికారులు చర్యలు తీసుకోవాలి



హైవేపై విచ్చలవిడిగా పశువులు సంచరిస్తుండడంతో వాహనాలు నడపడం ఇబ్బందిగా ఉంది. రాత్రివేళ పశువులు ఒక్కసారిగా రోడ్డు మీదకు వస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంగా ఉంటుంది. హైవే పైకి పశువులు రాకుండా పోలీసులు, జీఎమ్మార్ యంత్రాంగం చర్యలు తీసువాలి.

–భద్రయ్య, ఆటో డ్రైవర్, కేతేపల్లి

కేసులు నమోదు చేస్తాం



రైతులు తమ పశువులను మేపేందుకు హైవే పైకి వదల వద్దు. జాగ్రత్తగా ఇంటి వద్దనే కట్టివేసి పశుగ్రాసం వేసుకోవాలి. రోడ్డుపై పశువుల సంచారం వల్ల ప్రమాదం జరిగినట్లయితే వాటి యజమానులను బాధ్యులుగా చేసి కేసులు నమోదు చేస్తాం.

–ఎం.అనిల్‌రెడ్డి, ఎస్ఐ, కేతేపల్లి

రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఈఓ, అర్చకులు

కనగల్ : భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున మంగళవాయద్యాలతో సుప్రభాతసేవ, బాలభోగ నివేదన, 9గంటలకు విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, నీరాజన మంత్రపుష్పం, సాయంత్రం 5గంటలకు అంకురార్పణ, పుట్టబంగారం, అగ్నిప్రతిష్ఠాపన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈఓ జల్లేపల్లి జయరామయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. అంతకుముందు డప్పుచప్పుళ్ల మధ్య ఆలయం చుట్టూ మామిడి తోరణాలు కట్టారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు అంజమ్మరామచంద్రు, అల్లుబెల్లి పూలమ్మ, ఎంపీటీసీ నకిరెకంటి శైలజసైదులు, బీఆర్ఎస్ నాయకులు అల్లుబెల్లి నర్సింహారెడ్డి, నల్లబోతు యాదగిరి ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి, శ్రవణాచారి, గాదె దామోదర్, మహేష్ సిబ్బంది చంద్రయ్య, లింగయ్య, నాగరాజు, ఉపేందర్‌రెడ్డి, లింగస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా వీర సావర్కర్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : వీర సావర్కర్ 140వ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని సావర్కర్ నగర్‌లో గల ఆయన విగ్రహానికి జనగణమణ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనగనమణ ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను పనంగా పెట్టి పోరాడిన మహనీయుడు వీర సావర్కర్ అని కొనియాడారు. వీర్ సావర్కర్ జయంతి రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు ప్రతాప్ మహారాజ్, దోసపాటి శ్రీనివాస్, పోలా జనార్దన్, ఉమేష్‌జీ, వీరాచారి, శ్యాంసుందర్‌రెడ్డి, అంబర్ల సత్యనారాయణ, నాగేందర్, గణేశ్, ప్రదీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ప్రమాద బీమా కల్పించాలి



మాట్లాడుతున్న నూనె వెంకటస్వామి

చిట్యాల : హమాలీలకు ప్రభుత్వం ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. చిట్యాలలో ఆదివారం జరిగిన హమాలీ కార్మికుల జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కిరాణ, క్లాత్, ఐరన్, సిమెంట్, ఫర్టిలైజర్స్ ఆటోమొబైల్స్ ఇతర వ్యాపార సంస్థల్లో సరుకులు రవాణా చేస్తూ ప్రమాదాలకు గురవుతున్న హమాలీలను పట్టించుకునే వారే లేరన్నారు. ఆయా వ్యాపార సంస్థల యజమానులు బాధ్యత తీసుకుని హమాలీలకు ప్రమాద బీమా సౌకర్యంతోపాటు ఉచిత ఆరోగ్య చికిత్స చేయించాలన్నారు. చిట్యాల పట్టణ హమాలీ సంఘం అధ్యక్షుడు జిట్ట మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిట్ట పెద్ద మల్లేష్, జిట్ట శంకరయ్య, రుద్రవరం మహాలింగం, మేడి కృష్ణయ్య, కంబాలపల్లి శంకర్, వరంగల్ శ్రీనివాస్, జోగు వెంకన్న, దాసరి యాదయ్య పాల్గొన్నారు.

ఉచితంగా కార్పొరేట్ విద్యనందించాలి



మాట్లాడుతున్న అయితగోని జనార్దన్ గౌడ్

నల్లగొండ రూరల్ : బీసీ విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల్లో బెస్ట్ అవెలబుల్ స్కీం కింద ఉచితంగా విద్య అందించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక బీసీ కార్యాలయంలో విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచితంగా విద్య అందించిన తరహాలోనే బీసీ విద్యార్థులకు కూడా విద్య అందించాలని కోరారు. బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కారింగు నరేష్ గౌడ్, మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు మండల యాదగిరియాదవ్, కొంపల్లి రామన్న గౌడ్, నరసింహ, కాటం రాజు, సాయికుమార్, మహేష్, స్వామి, గణేశ్, శివ సాయి పాల్గొన్నారు.

‘విగ్రహ ఏర్పాటుకు అడ్డంకులు ఎందుకు’

మర్రిగూడ : సీఎం కేసీఆర్ దత్తత గ్రామమైన మర్రిగూడ మండలం లెంకలపల్లిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అడ్డంకులు ఎందుకని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున ప్రశ్నించారు. ఆదివారం లెంకలపల్లిలో అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్టాండ్ సమీపంలో దళితులకు సంబంధించిన భూమిలో అంబేద్కర్ ఆశయ సాధన సమితి సభ్యులు అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ముందుకు వస్తే.. కొందరు అగ్రకులాల వారు అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. వచ్చే నెలలో గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు జిల్లా వెంకటేష్, మానుపాటి భిక్షం, పందుల సైదులుగౌడ్, మలిగె యాదయ్య, ఏర్పుల యాదయ్య, జిల్లా అశోక్, నాగిళ్ల మారయ్య, నారపాక అంజి, ఐతగోని పాపయ్య, తిప్పర్తి శ్రీరాములు, లింగస్వామి, అంజయ్య, సతీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డికి వినతి

కనగల్ : నల్లగొండ పట్టణంలో జూన్‌లో నిర్వహించే ప్రియాంక గాంధీ బహిరంగ సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించే విధంగా చూడాలని కోరుతూ భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ ఆదివారం బోయినపల్లిలో కోరారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే విధంగా బీసీ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలె కృష్ణయ్య, ముడిపి యాదయ్య, సింగం లక్ష్మణ్, శంకర్, మురళి, నవీన్, శివ, శంకర్, ప్రకాష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. ముందుగా మండల పరిధిలోని దేపవారిగూడెం, పొనుగోడు, బచ్చన్నగూడెం, బోయినపల్లి, పర్వతగిరి, కనగల్ గ్రామాల్లో ఇటీవల పలు కారణాలతో మృతిచెందిన కుటుంబాలను ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, భారత వెంకటేశం, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు నర్సింగ్ సునితాకృష్ణయ్య గౌడ్, సుంకిరెడ్డి రమణారెడ్డి, గోలి నర్సిరెడ్డి, బోగరి రాంబాబు, కేసాని వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రంథాలయానికి ఫ్యాన్లు అందజేత

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఆ గ్రామానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న గ్రంథాలయానికి మాజీ న్యాయమూర్తి కుకుడాల లక్ష్మణ్ ఆదివారం ఐదు వేల నాలుగు వందల రూపాయల విలువ గల రెండు సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. దీంతో న్యాయమూర్తి లక్ష్మణ్‌కు గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్, పాఠకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

నల్లగొండ రూరల్ : ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఎల్‌వీ యాదవ్, శేఖర్ రెడ్డి, కూనూరి సత్యనారాయణ, విజయ్‌కుమార్, ఇస్తారి, వెంకటేశ్వర్లు, నాగరాజు, మనోహర్, గోపాల్, క్రాంతికుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

శాలిగౌరారం ప్రాజెక్టు రాచకాల్వకు బుంగ



సూరారం వద్ద రాచకాల్వ కట్టకు పడిన బుంగ

శాలిగౌరారం : జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే ప్రధాన రాచకాల్వకు యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం సూరారం గ్రామ సమీపంలో ఇటీవల బుంగపడింది. రాచకాల్వకు పడిన బుంగతో కాల్వకట్ట కోతకు గురై గండిపడేందుకు సిద్ధంగా ఉంది. రాచకాల్వ ద్వారా వచ్చే కొద్దిపాటి నీరు బుంగ ద్వారా వృథా అవుతోంది. బుంగ వల్ల రాచకాల్వలోకి మూసీనది నుంచి నీరు రాకుండా హెడ్ రెగ్యులేటర్ వద్ద గేట్లు మూసీ నీటిని నిరోధించారు. శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చేందుకు యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ వద్ద మూసీనదిపై ఆనకట్టతోపాటూ హెడ్ రెగ్యులేటర్ నిర్మించారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సుమారు 30 కిలోమీటర్ల పొడవు రాచకాల్వ ద్వారా ప్రాజెక్టులోకి నీరువచ్చి చేరుతుంది.

15 చెరువులకు నిలిచిపోయిన నీరు

శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే రాచకాల్వకు బుంగ పడడంతో నీటి విడుదల నిలిపివేశారు. దీంతో రాచకాలువకు అనుసంధానంగా ఉన్న15 చెరువులకు నీరు పూర్తిగా నిలిచిపోయింది. రాచ కాలువపై రామన్నపేట మండలం బంధం, బాచుప్పల చెరువులు, నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలుకు చెందిన రెండు చెరువులు, శాలిగౌరారం ప్రాజెక్టుతోపాటూ రామాంజాపురం, ఉప్పలంచ, మనిమద్దె, ఎన్‌జి కొత్తపల్లి, అడ్లూరు, మాధారంకలాన్ గ్రామాలకు చెందిన చెరువులు ఉన్నాయి. రాచ కాలువకు పడిన బుంగ, కట్టకోత వల్ల 15 చెరువుల్లోకి నీరు రాకుండా నిలిచిపోయింది. దీంతో ఆయా చెరువులకింద ఉన్న ఆయకట్టు రైతులు సాగునీటి విషయంలో ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని రాచ కాలువకు పడిన బుంగను పూడ్చి రాచకాలువ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని రైతులు కోరుతున్నారు.

బుంగను పూడ్చేందుకు చర్యలు చేపడుతున్నాం

శాలిగౌరారం ప్రాజెక్టు రాచకాలువకు పడిన బుంగను పూడ్చేందుకు చర్యలు చేపట్టాం. ఒకటిరెండు రోజుల్లో పనులు పూర్తిచేస్తాం. బుంగ వద్దకు మట్టిని తరలించేందుకు ట్రాక్టర్లు వెళ్లేందుకు భూమి తడిగా ఉండడంతో దారి సమస్య ఏర్పడింది. ప్రస్తుతం ట్రాక్టర్ల రాకపోకలకు దారి అనువుగా ఉంది. త్వరితగతిన బుంగను పూడ్చడంతోపాటు కోతకు గురైన రాచకాలువ కట్టను పటిష్టంగా నిర్మించి రాచకాలువకు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేసి చెరువులను నింపుతాం.

-అమర్, నీటిపారుదల శాఖ ఏఈ

ఇంటి పన్ను తగ్గించాలని వినతి

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇంటి పన్నులను తగ్గించాలని, ట్రాఫిక్ పోలీసులు వేస్తున్న జరిమానాలు తొలగించాలని కోరుతూ ఆదివారం పట్టణ కేంద్రానికి చెందిన వర్తకసంఘం ప్రతినిధులు, స్థానికులు బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కలిశారు. అనంతరం సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంటిపన్నుల విషయం అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు.

ప్రజాగర్జన సభను జయప్రదం చేయండి

మర్రిగూడ : జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బూడిద సురేష్, ఎరుకల నిరంజన్‌గౌడ్, కొన్రెడ్డి గిరి, అల్వాల నర్సింహ, జిల్లా బాలకృష్ణ, కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కట్టంగూర్ : మండలంలోని కురుమర్తి గ్రామానికి చెందిన శాగంటి సైదులు(37) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు సైదులు మృతదేహాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, మాజీ సర్పంచ్ బూరుగు శ్రీను, ధార భిక్షం, మర్రి రాజరత్నం, సైదులు, రమేష్, మిట్టపల్లి శివ, కానుగు శ్రీను, యాదగిరి ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

మునుగోడు : ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని పలివెల గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు పలివెల గ్రామశాఖ అధ్యక్షుడిగా బాతరాజు యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, కందుల సూర్య ప్రకాష్‌గౌడ్, పంతంగి గిరి, చెరుకు శంకరయ్య, చెర్కు జనార్దన్, చిలువేరు అజిత్, సాయి, రూపని నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న నర్సింహగౌడ్



కేతేపల్లి : నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



శాలిగౌరారంలో..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కనగల్ : జి యడవల్లిలో..

శాలిగౌరారం : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు విద్యాబోధన చేసిన ప్రధానోపాధ్యాయులు గుండా వరదయ్య, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, ఇక్బాల్, శ్రీనివాసరావు, యుగంధరాచారి, కర్మల్‌షారూన్, రికార్డ్ అసిస్టెంట్ రాములును పూలమాలలు వేసి, శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు.

కనగల్ : మండల పరిధిలోని జి యడవల్లి ఉన్నత పాఠశాలలో చదివిన 1997–98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుంకిరెడ్డి రవీందర్‌రెడ్డి, బి కృష్ణయ్య, గంజి నిరంజన్, అయితగోని రవి, కర్నాటి మల్లేష్, గుత్తా కృష్ణారెడ్డి, కారింగు నర్సింహ, కాసర్ల స్వప్న, వరికుప్పల యాదయ్య, చింతల వెంకన్న, నాగలక్ష్మీ, గీత పరమేశ్వరి, పార్వతమ్మ, యశోద, ఎస్‌కే ముస్తాఫా, కే యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి : మండలంలోని తుంగతుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కేతేపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. మధ్యాహ్న భోజనాల అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిట్యాల సైదులు, కీర్తి వెంకన్న, మహేశ్వరి, రాజు, సతీష్, నవీన్, సురేష్, జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కేతేపల్లి : మండలంలోని భీమారం గ్రామంలో సోమవారం నవ్య చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని సొసైటీ అధ్యక్షుడు పులిగిల్ల అభిరామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 9.30 వరకు నిర్వహించనున్న ఈశిబిరంలో బీపీ, షుగర్, గుండె, కిడ్నీ అవయవాలకు సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

నూతన సీఐగా దేవేందర్

చౌటుప్పల్ : పట్టణ నూతన సీఐగా ఎస్.దేవేందర్ రానున్నారు. ప్రస్తుతం భువనగిరి సీసీఎస్‌లో ఉన్న ఆయనను ఇక్కడికి బదిలీ చేస్తూ రాచకొండ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన మల్లికార్జున్‌రెడ్డి హైదరాబాద్‌లోని చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

ఆలయానికి విరాళం

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయానికి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పంపిన రూ.25వేల విరాళాన్ని పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుత్త ప్రేంచందర్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు ఉన్నారు.